క్లుప్తంగా

అమ్మవారికి బత్తాయి, ద్రాక్షలతో అలంకరణ


ద్రాక్ష, బత్తాయి పండ్లతో రాస పోలమాంబ

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబ అమ్మవారిని మంగళవారం అత్యంత వైభవంగా అలంకరించారు. 122వ అలంకరణలో భాగంగా ఆలయ కమిటీ ప్రతినిధులు అమ్మవారిని బత్తాయి, ద్రాక్ష, జరబర పువ్వులు, గజమాలలతో అలంకరించారు. ఈ అలంకరణకు అవసరమైన సహకారాన్ని మజ్జివలసకు చెందిన అంజూరి కుటుంబ సభ్యులు అందించారు. తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

రుషికొండ బీచ్‌లో పర్యాటకుల అసహనం


నడక మార్గంలో షాపులు

కొమ్మాది: ప్రముఖ పర్యాటక కేంద్రమైన రుషికొండ బీచ్‌కు వచ్చే పర్యాటకులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. బీచ్‌కు వెళ్లే ప్రధాన దారిలో వ్యాపారులు ఇష్టానుసారంగా దుకాణాలు ఏర్పాటు చేయడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ దుకాణాల వద్ద పేరుకుపోతున్న చెత్తాచెదారం వల్ల కుక్కలు తిరుగుతూ మరింత సమస్యను సృష్టిస్తున్నాయి. కుటుంబాలతో వచ్చే పర్యాటకులు విశ్రాంతి తీసుకోవడానికి స్థలం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారులకు ప్రత్యేక స్థలాలు కేటాయించి, పర్యాటకులకు ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

యువకుడిపై దాడి చేసిన నిందితుల అరెస్ట్


చికిత్స పొందుతున్న పవన్

భీమునిపట్నం: యువకుడిపై దాడి కేసులో ఏడుగురు నిందితులను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. సీఐ తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం, బ్యాంక్ కాలనీకి చెందిన 19 ఏళ్ల గొల్ల పవన్ సోమవారం రాత్రి తన పుట్టినరోజు సందర్భంగా స్నేహితులను కలిశాడు. ఈ క్రమంలో గతంలో ఉన్న మనస్పర్థల కారణంగా రౌడీషీటర్ పతివాడ వినోద్, మరో ఆరుగురు కలిసి పవన్‌ను మజ్జివలస లేఅవుట్‌కు తీసుకెళ్లి తీవ్రంగా కొట్టారు. గాయపడిన పవన్‌ను కుటుంబ సభ్యులు విశాఖలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ కేసులో నిందితులను అరెస్ట్ చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

పంచముఖ ఆంజనేయ స్వామికి విశేష పూజలు


పంచముఖ ఆంజనేయ స్వామి

మధురవాడ: మధురవాడ జోన్ కార్యాలయం సమీపంలోని సిద్ధేశ్వర స్వామి పీఠంలో వెలసిన పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృత, సుగంధ ద్రవ్యాభిషేకాలు నిర్వహించారు. అనంతరం సిందూర, పుష్పార్చనలు చేశారు. తమలపాకులు, నిమ్మకాయలు, వడల దండలతో ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన


పాత కొవ్వాడలో చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీవో విజయ కుమార్

పద్మనాభం: స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్రాలో భాగంగా మండలంలోని పాత కొవ్వాడలో మంగళవారం ఎంపీడీవో ఎం.విజయ కుమార్ పర్యటించి పారిశుధ్య కార్యక్రమాలు పరిశీలించారు. చెత్త సేకరణను, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. రక్షిత మంచి నీటి పథకాలను క్లోరినేషన్ చేస్తున్నారా ?లేదా ఆరా తీశారు.

భీమిలి పశు వ్యాధుల నిర్ధారణ ప్రయోగశాల

రైతులకు వరం


వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్, ఇందులోనే పశు వ్యాధి నిర్ధారణ శాల ఉంది

భీమునిపట్నం: భీమిలిలో గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన పశు వ్యాధుల నిర్ధారణ ప్రయోగశాల, ఈ ప్రాంత రైతులకు, గ్రామస్తులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ప్రాంగణంలో ఉన్న ఈ ల్యాబ్, భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల పరిధిలోని పశువుల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషిస్తోంది.

పరీక్షల విధానం

రైతు భరోసా కేంద్రాలు, స్థానిక పశువైద్యశాలల ద్వారా రైతులు తమ పశువుల నమూనాలను ఈ ల్యాబ్‌కు పంపిస్తారు. ఇక్కడ ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక అసిస్టెంట్ కలిసి నమూనాలను పరీక్షించి వ్యాధులను నిర్ధారిస్తారు. పశువులలో సాధారణంగా కనిపించే నులిపురుగుల సమస్యలు, చర్మ వ్యాధులు, కాలేయానికి సోకే జలగల వంటివి ఇక్కడ ప్రధానంగా పరీక్షించడం జరుగుతుంది. అలాగే, పాలల్లో ఇన్ఫెక్షన్లు, పొదుగు వ్యాధులు, గర్భకోశ వ్యాధులు వంటి వాటిని కూడా నిర్ధారిస్తారు.

ప్రయోజనాలు

ల్యాబ్‌లో పరీక్షలు జరిపిన తరువాత, ఏ రకమైన వ్యాధి ఉందో స్పష్టంగా తెలుస్తుంది. దాని ఆధారంగా, పశువైద్యులు సరైన చికిత్సను, నివారణ చర్యలను సూచించగలుగుతారు. దీనివల్ల పశువుల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా, రైతులు సమయానికి, సరైన చికిత్స అందించి ఆర్థికంగా నష్టపోకుండా ఉంటారు. ఈ ల్యాబ్ రైతులకు ఒక వరం లాంటిదని స్థానికులు చెబుతున్నారు.


పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల


ల్యాబ్‌లోని పరీక్షల యంత్రాలు

సంవత్సరం	పరీక్షలు
2021-22	1,283
2022-23	1,576
2023-24	3,823
2024-25	4,053
2025-26	454 ఆగష్టు వరకు
మొత్తం పరీక్షలు	1,189


వ్యాధుల నిర్ధారణ పరీక్షలను నిర్వహిస్తున్న టెక్నీషియన్

అవగాహన కల్పిస్తున్నాం



ఇక్కడ ల్యాబ్‌లో అన్ని వ్యాధుల నిర్ధారణకు సంబంధించిన పరీక్షలను చాలా శ్రద్ధ, జాగ్రత్తలతో నిర్వహిస్తున్నాం. ఆయా సమస్యల గురించి సమస్యల గురించి వచ్చిన వాటి పరీక్షలను నిర్వహించడం తోపాటు వెంటనే వాటికి అవసరమైన చికిత్సలు ఎలా నిర్వహించాలో తెలియజేస్తున్నాం. మళ్లీ ఇబ్బందుల రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి సూచనలు, సలహాలు ఇస్తున్నాం.

–ఎస్.విశాలాక్షి, ల్యాబ్ టెక్నీషియన్

కారు షెడ్ కూడలిలో అంధకారం

పీఎం పాలెం: కారు షెడ్ కూడలి నుంచి పాత పీఎం పాలెంకు వెళ్లే రోడ్డులో వీధి దీపాలు సక్రమంగా వెలగకపోవడంతో అంధకారం అలుముకుంటుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు మార్గంలో ప్రయాణించే పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు మీదుగా పిలకవానిపాలెం, వుడా కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీలతో పాటు పలు కాలనీలకు రాకపోకలు సాగిస్తుంటారు. వీధి దీపాలు ఎప్పుడూ పూర్తిస్థాయిలో వెలగడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ సమస్యపై వెంటనే స్పందించి వీధి దీపాలను పునరుద్ధరించాలని జీవీఎంసీ అధికారులను స్థానికులు కోరుతున్నారు.


పాత పీఎం పాలెం రోడ్డులో వెలగని వీధిదీపం

ఎట్టకేలకు దిగొచ్చిన థియేటర్ యాజమాన్యం

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: చిట్టివలస గణేష్ థియేటర్ యాజమాన్యం రోడ్డుపై అడ్డంగా ఉంచిన స్టాపర్లను మంగళవారం తొలగించింది. 'సాక్షి' పత్రికలో 'థియేటర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి' అంటూ ప్రచురించిన కథనానికి జీవీఎంసీ భీమిలి జోన్ అధికారులు, పోలీసులు స్పందించారు. గణేష్ థియేటర్ కూడలి నుంచి భీమిలి రోడ్డు వరకు అడ్డంగా ఉన్న స్టాపర్లను అధికారులు స్వయంగా దగ్గరుండి తొలగించారు. భవిష్యత్తులో ఇలాంటి చర్యలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని థియేటర్ యాజమాన్యాన్ని హెచ్చరించారు. ఈ నిర్ణయంతో స్థానిక వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు.


స్టాపర్లు తొలగించడంతో ఖాళీగా ఉన్న గణేష్ థియేటర్ రహదారి

ఘనంగా హిందీ దినోత్సవం

పద్మనాభం: పొట్నూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం హిందీ దివస్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సురదాస్, మీరాబాయి, తులసీదాస్ వంటి ప్రముఖుల వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు 70 ప్రాజెక్టులను ప్రదర్శించారు. వ్యాసరచన, క్విజ్ వంటి 10 రకాల పోటీలు నిర్వహించి, విజేతలైన 60 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మరో 130 మంది విద్యార్థులకు పెన్సిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వీవీ రామారావు, హిందీ టీచర్ డి.చిన్నారి, నాయకులు ఎం.నందీశ్వరరావు, బి.సన్యాసినాయుడు, ఎం.నారాయణమూర్తి, యూనియన్ నాయకులు ఆర్.జగదీష్ బాబు, ఎ.అరుణ్ కుమార్ పాల్గొన్నారు.


జ్ఞాపికలతో విద్యార్థులు

విద్యార్థులకు నగదు బహుమతులు

తగరపువలస: గత ఏడాది మొదటి సంవత్సరం పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను చిట్టివలసలోని శ్రీకృష్ణ జూనియర్ యాజమాన్యం సత్కరించింది. మంగళవారం ఫ్రెషర్స్ డే, కళాశాల 20వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. 470 మార్కులకు గాను 465, 464, 463, 462, 461 మార్కులు సాధించిన విద్యార్థులకు కరస్పాండెంట్ బి. నరసింగరావు ఒక్కొక్కరికి రూ. 20 వేలు చొప్పున బహుమతులు అందజేశారు. అలాగే 450 మార్కులు దాటిన ఇతర విద్యార్థులను కూడా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు జరజాపు సతీష్ కుమార్, సూర్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ తాతారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కళాశాల వేడుకలలో పాల్గొన్న అధ్యాపకులు

సబ్ స్టేషన్ ప్రారంభించేదెప్పుడు..?


ప్రారంభానికి నోచుకోని వాంబేకాలనీలోని విద్యుత్ సబ్ స్టేషన్

మధురవాడ: విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించే లక్ష్యంతో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి వాంబే కాలనీలో నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్ ఇంకా ప్రజలకు అందుబాటులోకి రాలేదు. రెండు నెలల క్రితమే సాంకేతిక పనులు పూర్తయినా, అధికారులు ట్రయల్స్ పేరుతో జాప్యం చేస్తున్నారని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మధురవాడ సబ్ స్టేషన్ పరిధిలో నిరంతరం అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలు చాలా ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న సబ్ స్టేషన్ ఈ ప్రాంతాల విద్యుత్ అవసరాలను పూర్తి స్థాయిలో తీర్చలేకపోతోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు గత ప్రభుత్వ హయాంలో కొత్త సబ్ స్టేషన్ నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నారు. భారీ వ్యయంతో నిర్మాణం పూర్తయినా, అధికారుల నిర్లక్ష్యం వల్ల అది ఇంకా అందుబాటులోకి రాలేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి సబ్ స్టేషన్‌ను వెంటనే ప్రారంభించాలని వారు కోరుతున్నారు.

డ్రైనేజీల్లో పేరుకుపోయిన వ్యర్థాలు


హౌసింగ్ బోర్డు కాలనీలోని పేరుకు పోయిన వ్యర్థాలు

పీఎం పాలెం: స్థానిక ప్రధాన డ్రైనేజీలో పూడిక పేరుకుపోవడంతో మురుగునీరు నిలిచిపోతోందని, దీని వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని హౌసింగ్ బోర్డు, ఆర్హెచ్, ముస్లిం కాలనీల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్టేట్ బ్యాంక్ సమీపంలోని ప్రధాన డ్రైనేజీ జంక్షన్ వద్ద పూడిక, చెత్తాచెదారం పేరుకుపోవడం వల్ల నీరు ప్రవహించక దోమలు, ఈగలు పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే స్పందించి పూడికను తొలగించి, సమస్యను పరిష్కరించాలని జీవీఎంసీ పారిశుధ్య అధికారులను స్థానికులు కోరుతున్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

తగరపువలస: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా బుధవారం ఆనందపురం మండలం, గంభీరం పంచాయతీ, దుక్కవానిపాలెంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు.గ్రామంలోని దుర్గాలమ్మ ఆలయం వద్ద జరిగే ఈ శిబిరంలో పరీక్షలు చేయించుకున్న వారికి అవసరమైతే ఉచితంగా శస్త్రచికిత్సలు కూడా అందిస్తామని అడ్డూరి సురేష్ తెలిపారు.

బంగారమ్మకు పసుపు, కుంకుమ సమర్పణ


అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు వెళ్తున్న గుమ్మడివానిపాలెం ప్రజలు

తగరపువలస: ఆనందపురం మండలం కొంత్యాం పంచాయతీ గుమ్మడివానిపాలెం ప్రజలు మంగళవారం బంగారమ్మవారికి పసుపు,కుంకుమలు చెల్లించుకున్నారు. బాణసంచా, సాముగరిడీ తదితర కార్యక్రమాల ద్వారా అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు బోని, గిడిజాలలో వైద్య శిబిరాలు

తగరపువలస: స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా ఆనందపురం మండలంలోని బోని, గిడిజాల పంచాయతీలలో బుధవారం వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 వరకు పీహెచ్‌సీ పరిధిలోని 13 సచివాలయాల్లో మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఆనందపురం పీహెచ్‌సీ ప్రధాన వైద్యురాలు షేక్ షబీనాభాను తెలిపారు. రక్తహీనత, క్యాన్సర్ వంటి వ్యాధులపై అవగాహన, పోషకాహార లోపం ఉన్నవారికి చికిత్స, అలాగే 5 ఏళ్లలోపు పిల్లలకు టీకాలు ఇస్తామని ఆమె వివరించారు. ఇదే పథకంలో భాగంగా భీమిలి జోన్, రెండో వార్డులోని పాత మీసేవ కార్యాలయంలో కూడా వైద్య శిబిరం జరగనుంది.

హై వోల్టేజీతో గృహోపకరణాలకు నష్టం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు జీరుపేటలో మంగళవారం హై వోల్టేజీ కారణంగా పలువురి ఇళ్లతో విద్యుత్ గృహోపకరణాలకు నష్టం వాటిల్లింది. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో పెద్ద శబ్దంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలినప్పుడు, సాయంత్రం దీనిని పునరుద్ధరించినప్పుడు గ్రామంలో గృహోపకరణాలు కాలిపోయినట్టు గ్రామస్తులు వాపోయారు.

ఓజోన్ పొరను కాపాడుకోవాలి


గొడుగులతో ప్రదర్శన నిర్వహిస్తున్న చాత్రోపాధ్యాయులు, అధ్యాపకులు


ఓజోన్ పొర పరిరక్షణ ఆవశ్యకత గురించి తెలియచేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీవాణి

భీమునిపట్నం: ఓజోన్ పొర పర్యావరణ పరిరక్షణకు ఎంతో ముఖ్యమైనదని, దానిని కాపాడటం అందరి బాధ్యత అని భీమిలిలోని జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ ఎల్. సుధాకర్ అన్నారు. అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం సందర్భంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వాతావరణాన్ని కాపాడడంలో ఓజోన్ పొర కవచంలా పనిచేస్తుందని, కానీ పర్యావరణ కాలుష్యం వల్ల అది దెబ్బతింటోందన్నారు. ఓజోన్ పొరను రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని ఆయన పిలుపునిచ్చారు. డైట్ వైస్ ప్రిన్సిపాల్ జి.జి.ఎస్. నాగేశ్వరరావు మాట్లాడుతూ, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, మొక్కలు పెంచడాన్ని ఒక ఉద్యమంగా చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా చాత్రోపాధ్యాయులు, అధ్యాపకులు అవగాహన ప్రదర్శన నిర్వహించారు.

పర్యావరణానికి హాని కలిగించొద్దు

తగరపువలస: పర్యావరణానికి హాని కలిగించే పనులను మానవళి మానుకోవాలని చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి. శ్రీవాణి అన్నారు. ప్రపంచ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ ఏడాది ఓజోన్ దినోత్సవానికి 'సైన్స్ అండ్ గ్లోబల్ యాక్షన్' అనే థీమ్‌ను ఎంచుకున్నట్లు తెలిపారు. అనేక రసాయనాలు ఓజోన్ పొరకు తీవ్రమైన హాని కలిగిస్తున్నాయని, వాటి వినియోగాన్ని తగ్గించడం మాంట్రియల్ ప్రోటోకాల్ లక్ష్యమని ఆమె వివరించారు. అధ్యాపకుడు బి. సుధాంశ ప్రభాకర్ పాల్గొన్నారు.

పెట్రోలియం ఉత్పత్తులతో భూగర్భ జలాల కలుషితం


కలుషిత నీటిని చూపిస్తున్న స్థానికులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులోని ఎండాడ, వివేకానందనగర్ కాలనీలో భూగర్భ జలాలు పెట్రో లియం ఉత్పత్తులతో కలుషితమవుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీ సమీపంలో ఉన్న పెట్రోల్ బంక్ వల్ల తాగునీరు పెట్రోల్ వాసనతో వస్తోందని వారు తెలిపారు. ఈ సమస్యపై మధురవాడ జోనల్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు స్థానికులు చెప్పారు. రీజనల్ పబ్లిక్ హెల్త్ ల్యాబరేటరీకి పంపిన నీటి నమూనాల నివేదికలో కూడా పెట్రోలియం ఉత్పత్తుల కాలుష్యం ఉన్నట్లు తేలిందని స్థానికుడు రామకృష్ణ తెలిపారు. పెట్రోల్ బంక్ స్టోరేజ్ ట్యాంకులను పరిశీలించి మరమ్మతులు చేయాలని కోరినా, బంక్ యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

తునివలస బంగారమ్మ ఆలయంలో చోరీ

పద్మనాభం: మండలంలోని తునివలసలో ఉన్న బంగారమ్మ ఆలయంలో చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోని హుండీని పగలగొట్టి అందులోని డబ్బును దొంగలించారు. గతంలో కూడా ఇలాగే చోరీ జరగడంతో, గ్రామ పెద్దలు ఏడాదికి ఒకసారి కాకుండా ప్రతి ఆరు నెలలకు ఒకసారి హుండీని లెక్కించాలని నిర్ణయించుకున్నారు. రెండు రోజుల్లో లెక్కించాల్సి ఉండగా, అంతలోనే దొంగలు ఈ చోరీకి పాల్పడ్డారు. మంగళవారం ఉదయం ఆలయ పూజారి దూసి అప్పలనరిసిమ్మ ఆలయం శుభ్రం చేయడానికి వచ్చినప్పుడు గేటు తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. లోపల హుండీ పగలగొట్టి డబ్బును తీసుకెళ్లినట్లు గుర్తించారు. దొంగలు హుండీని ఆలయం బయట పడేసి వెళ్లిపోయారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందుకున్న క్రైమ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.


విరగ్గొట్టిన హుండీ

నృత్యోత్సవాల్లో శ్రీనృత్యప్రియ డ్యాన్స్ అకాడమీ విద్యార్థుల ప్రతిభ

తగరపువలస: ఈ నెల 12 నుంచి 14 వరకు తిరుపతిలో జరిగిన 35వ స్వర్ణోత్సవ, నృత్యోత్సవాల వార్షికోత్సవంలో జీవీఎంసీ భీమిలి జోన్ 2వ వార్డు, సంగివలసకు చెందిన శ్రీనృత్యప్రియ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. టీటీడీ ఆధ్వర్యంలో తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో నిర్వహించిన ఈ పోటీలలో, అన్నమయ్య కీర్తన 'అదివో అల్లదివో'కు క్లాసికల్ నృత్య ప్రదర్శన ఇచ్చారు. ఈ ప్రదర్శనకు గాను విద్యార్థులకు రూ. 5 వేల బహుమతి, సర్టిఫికెట్లు, మెమెంటోలను నిర్వాహకులు అందజేశారు. నృత్య శిక్షకురాలు చేట్ల రజనీరెడ్డి పర్యవేక్షణలో విద్యార్థులు వి.పాలవెల్లి, జి.పూజిత, ఎ.తనూజ, వై. చరణి, పర్ణిక, కె. హన్విక ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు.


నృత్యప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు

పోతిన సన్యాసిరావుకు ఘన నివాళి

మధురవాడ: మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ పోతిన సన్యాసిరావు 41వ వర్ధంతిని మధురవాడలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, రైతులు, సీపీఐ జిల్లా కార్యదర్శిగా మధురవాడ అభివృద్ధికి సన్యాసిరావు చేసిన సేవలను కొనియాడారు. క్వారీ సొసైటీ స్థాపించి వందలాది మందికి ఉపాధి కల్పించారని, చంద్రంపాలెంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏర్పాటుకు కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు కూడా పాల్గొని సన్యాసిరావు సేవలను స్మరించుకున్నారు.


కమ్యూనిస్ట్ నాయకుడు సన్యాసిరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అఖిల పక్ష నాయకులు

19న రణభేరి బైక్ జాతా

తగరపువలస: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 19న జరిగే రణభేరి బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.ఆర్. అంబేడ్కర్ పిలుపునిచ్చారు. ఈ ర్యాలీని విజయవంతం చేయడం ద్వారా బోధనేతర పనుల రద్దు, 11వ పీఆర్సీ బకాయిలు, పెండింగ్ డీఏల చెల్లింపు, 12వ పీఆర్సీ కమిషన్ ప్రకటనతో పాటు 30 శాతం ఐఆర్ ప్రకటించాలని కోరారు. ఈ సందర్భంగా ఆనందపురం జడ్పీహైస్కూల్‌లో రణభేరి పోస్టర్లు విడుదల చేశారు.



రణభేరి జాతా పోస్టర్లు విడుదల చేస్తున్న యూటీఎఫ్ నేతలు

జీవీఎంసీ హైస్కూల్‌లో స్వచ్ఛత పక్వాడా

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్, ఒకటో వార్డులోని సంతపేట అంబేడ్కర్ హైస్కూల్‌లో స్వచ్ఛత పక్వాడా కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేయడం, విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించడం, వివిధ పోటీలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ఈ నెల 30 వరకు కొనసాగుతుంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీదేవి, ప్రమీల, సునీత, రాజ్యలక్ష్మి, మహేశ్వరరావు, విశ్వేశ్వరరావు, రెడ్డి రాంబాబు, రెడ్డిపల్లి అప్పలరాజు పాల్గొన్నారు.